

రోడ్డెక్కేదెలా..దిగేదెలా..?

మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లి గడ్డపై సీసీరోడ్డును ఎత్తుగా నిర్మించారు. నిబంధనల మేరకు ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా సీసీరోడ్డుకు ఇరువైపులా మార్జిన్లలో గ్రావెల్‌ను తోలాలి. కానీ కాంట్రాక్టర్ గ్రావెల్‌ను తోలడం మరిచిపోవడంతో 8 నెలలుగా ప్రజలు రోడ్డెక్కేందుకు..దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును పరిశీలించి నిబంధనల మేరకు ఉంటేనే బిల్లులు చేయాల్సిన అధికారులు కమీషన్లు తీసుకుని బిల్లులు చేసేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్జిన్లకు గ్రావెల్‌ను తోలించాలని స్థానికులు కోరుతున్నారు.

– వరికుంటపాడు



అధ్వానంగా మరుగుదొడ్లు

వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నీటి వసతి, శుభ్రతకు నోచుకోక మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో విద్యార్థులు అత్యవసరమైతే ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించి శుభ్రంగా ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– వరికుంటపాడు



ఇవేం చెత్త పనులు?

మండలంలోని సింగారెడ్డిపల్లి పంచాయతీలో సేకరించిన చెత్తను బీసీకాలనీకి వెళ్లే రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. డంపింగ్‌యార్డు ఉన్నా చెత్తను అక్కడికి తరలించకుండా ఇలా రోడ్డు పక్కన పారబోస్తున్నారు. చెత్త దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు ఈదురుగాలులకు ఎగిరి మీద పడుతుండడంతో అటుగా వెళ్లే బీసీకాలనీవాసులతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సీతారామపురం

క్లుప్తంగా

కొట్టాలపల్లి సొసైటీలో యూరియా పంపిణీ

ఉదయగిరి రూరల్: మండలంలోని కొట్టాలపల్లి సొసైటీలో రైతులకు యూరియాను సొసైటీ చైర్మన్ గడ్డం వెంకటసామయ్య, ఏడీఏ చెన్నారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో 13 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. 40 కేజీల బస్తాను రూ.266.50కు విక్రయిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జెరాక్స్ కాపీలతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఏఓ విజయభాస్కర్, సీఈఓ పోలయ్య, స్థానిక నాయకులు బయన్న, రాజా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో 71 మి.మీ. వర్షపాతం నమోదు

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతంలో గురువారం రాత్రి 71 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కాగా రబీ పంటలకు వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.315 లభించింది. వేలానికి 1065 బేళ్లు రాగా, 758 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.69, సగటున రూ.146.59 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

14 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

అనుమసముద్రంపేట: మండలంలోని ఆధార్‌కార్డులు లేని గిరిజనుల కోసం ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న అనుమసముద్రం, 15న ఏఎస్‌పేట 16న కావలియడవల్లి, 17న చిరమన, 18న గుడిపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల గిరిజనులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



మినగల్లులో విత్తనాల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమశిల: అనంతసాగరం మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వీ దేవసేనమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఏఓలు శైలజకుమారి, కృష్ణవేణి ఉన్నారు.

ఘాట్‌రోడ్డులో కంటైనర్ బోల్తా

- స్తంభించిన ట్రాఫిక్



సీతారామపురం : మండలంలోని సీతారామపురం-పోరుమామిళ్ల ఘాట్‌రోడ్డులో శుక్రవారం ట్రాలీపై తీసుకెళ్తున్న కంటైనర్ బోల్తా పడింది. వైఎస్సార్ జిల్లా నుంచి ప్రకాశం జిల్లా కనిగిరికి ఇనుప సామగ్రి కలిగిన కంటైనర్‌తో బయలుదేరిన ట్రాలీ ఘాట్‌రోడ్డులోని ఓ మలుపులో తిరుగుతుండగా కంటైనర్ పక్కకు ఒరిగిపోయింది. దీంతో ఘాట్‌రోడ్డులో గంటల తరబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చివరకు భారీ క్రేన్ సాయంతో కంటైనర్‌ను పైకి లేపి ట్రాలీ మీద ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ



ఆత్మకూరు: ఏఐసీసీ పిలుపు మేరకు ఆత్మకూరులో ఓట్ చోర్-గద్దీ చోడ్ పేరుతో కాంగ్రెస్ యువజన నాయకులు శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన నాయకులు ఇంటింటికి వెళ్లి ఓట్‌చోర్‌పై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన అంశాలను వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతూ సంతకాలను సేకరించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, సయ్యద్ రసూల్, ఖాజా సుల్తాన్, కౌసల్య, విజయమ్మ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈ శాఖ ముట్టదు.. ఆ శాఖకు పట్టదు



సచివాలయం వద్ద బురదమయంగా రోడ్డు



రూపురేఖలు కోల్పోయిన చెరువుకట్ట రోడ్డు

- అధ్వానంగా దుత్తలూరు చెరువుకట్ట రోడ్డు
- తమ పరిధిలో లేదంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- పునర్నిర్మాణాన్ని పట్టించుకోని హైవే అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్ నుంచి దుత్తలూరు ప్రధాన గ్రామం మీదుగా వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. తారు పూర్తిగా లేచిపోయి గుంతలతో నిండిన ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 565వ జాతీయ రహదారి నిర్మించక ముందు ఈ రహదారి మీదుగానే పామూరు వైపుగా వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుండేవి. 565వ జాతీయ రహదారి నిర్మించిన తర్వాత ఈ రోడ్డును పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. దీంతో చెరువుకట్ట రోడ్డు పూర్తిగా రూపురేఖలు కోల్పోయి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకట్టపై రక్షణ గోడలు కూలిపోవడంతో ఎత్తుపల్లాలుగా మారింది. కొన్నిచోట్ల కట్టలు బీటలు వారుతున్నాయి. గతంలో రోడ్డుపై వీధిదీపాలు సైతం వెలుగుతుండేవి. ఇటీవల ఈదురు గాలులకు స్తంభాలు విరిగి పడిపోయాయి. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో చీకటిపడితే అంధకారం నెలకొంటోంది. వర్షం పడితే దుత్తలూరు సమీపంలోని అలుగుపై వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయం నుంచి హైవే వరకు చిన్నపాటి వర్షానికి కూడా బురదమయంగా మారుతోంది. ఈ రోడ్డుతో తమకు సంబంధం లేదని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చెబుతుండగా, హైవే అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబ్యాంధిత అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

మహిమలూరులో ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆత్మకూరురూరల్: మహిమలూరు సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ పఠాన్ రఫీఖాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమలూరు పరిసర గ్రామాల ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి విజయ్, వీఆర్వో మీరావలి, స్థానిక నాయకులు వీవీ రమణారెడ్డి, ఎం నారాయణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు

మండలంలోని గిరిజనుల కోసం ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఫీఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న అప్పారావుపాళెం, 14న మహిమలూరు, 15న కరటంపాడు సచివాలయాల్లో క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిసర గ్రామాల గిరిజనులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: గండ్లవేడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి శిలాప్రతిమలకు మహాస్నపనం, ధాన్యాది, శయ్యాదివాసాలు నిర్వహించారు.

వెంకటేశ్వరస్వామికి పల్లకిసేవ

సాతానుపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పల్లకిసేవను నిర్వహించారు. ఉదయం వెంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించి అష్టోత్తర పూజ, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముద్దర వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి రూరల్: ఆవులు, ఎద్దులకు సోకే ముద్దర చర్మ వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో ముద్దర వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. తెల్ల పశువులకు ముందస్తుగా నేలవాము ఆకు, బెల్లం కలిపి తినిపించాలన్నారు. తమలపాకులు 10, మిరియాలు 10, వెల్లుల్లి రెబ్బలు 2, కలబంద గుజ్జు 1 కప్పు, వేపాకులు పిడికెడు, తులసి ఆకులు పిడికెడు, పసుపు రెండు స్పూన్లు, బెల్లం 50 గ్రాములు, కల్లుఉప్పు 5 గ్రాములు కలిపి నూరి వారానికోసారి రోజుకు రెండుసార్లు తినిపించడం ద్వారా వ్యాధి సోకకుండా నివారించవచ్చని వివరించారు. ముద్దర వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స చేయించాలన్నారు.

రూ.14.20 కోట్లతో చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న డీఈఈ చంద్రమౌళి

ఉదయగిరి: ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని చెరువులను ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు రూ.14.20 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఉదయగిరి సబ్‌డివిజన్ జలవనరులశాఖ డీఈఈ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఆయన ఉదయగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి మండలం ఆర్లపడియ చెరువును రూ.1.34 కోట్లు, జీ అయ్యవారిపల్లె చెరువును రూ.1.42 కోట్లు, పుల్లాయపల్లి చెరువును రూ.1.71 కోట్లు, తిరుమలాపురం చెరువును రూ.2 కోట్లు, వెంకట్రావుపల్లి చెరువును రూ.1.45 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. సీతారామపురం మండలం సీతారామపురం ఊరచెరువును రూ.1.62 కోట్లు, స్వామిచెరువును రూ.1.66 కోట్లు, మర్రివూట్ల రిజర్వాయర్‌ను రూ.3 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఈ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ నాగూర్‌వలి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

కలిగిరి: మండలంలోని కలిగిరి, కుడుములదిన్నెపాడు, అనంతరపురం, నాగిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేశామని వివరించారు.

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ లిఖిత్ శుక్రవారం తెలిపారు. 33 కేవీలైన్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

సోమశిల: అనంతసాగరం, సోమశిల సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. త్రీఫేస్ విద్యుత్‌ను ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు అందజేయనున్నట్లు చెప్పారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున

చేజర్ల(సోమశిల): వరల్డ్ మెంట్ హెల్త్ డేను పురస్కరించుకుని చేజర్ల మండలం ఆదురుపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య సలహాదారు మల్లికార్జున మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, అది జీవితం, నిద్రపై చూపే ప్రభావాన్ని వివరించారు. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేయడంతో పాటు మంచి ఆహారం తీసుకోవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులతో మనోభావాలను పంచుకోవడం ద్వారా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల సాధికారిత, సమానత్వంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఎంలు పద్మజ, మల్లికార్జున మాట్లాడుతూ బాలికల హక్కులు, వారి భవిష్యత్తు అభివృద్ధి, సమాజంలో బాలికల పాత్రపై అవగాహన కల్పించారు.

చిన్నమాచనూరులో గ్రామసభ

మర్రిపాడు: మండలంలోని చిన్నమాచనూరులో సర్పంచ్ కటకం నరసింహులు అధ్యక్షతన గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. పంచాయతీని మూడు భాగాలుగా విభజించే విషయమై కొందరు పెద్దలు చేసిన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 12 మంది వార్డు సభ్యుల్లో 11మంది పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే కలిసిఉండడమే మంచిదని అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధి, సౌకర్యాల విస్తరణ, ప్రజాసేవల సమర్థత కోసం ఒకటిగానే కొనసాగడం మంచిదని పేర్కొన్నారు. ఎంపీటీసీ టమటం బాలగురవమ్మ, కోఆప్షన్ సభ్యుడు షేక్ హసన్ సాహెబ్, టీడీపీ సీనియర్ నాయకుడు పావులూరి వెంకట్రామయ్య, పంచాయతీకార్యదర్శి పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి



ఉదయగిరి రూరల్: అవినీతిరహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవీంద్రరెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నజీర్ అన్నారు. విజిలెన్స్ అవగాహన ఉత్సవాల్లో భాగంగా గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీజీబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'అవినీతిని అరికట్టడం ఎలా? అనే అంశంపై వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. బ్యాంకు సిబ్బంది అజయ్, రమేష్, చిన్న ఖాశీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



సీతారామపురం : మండల విద్యావనరుల కేంద్రంలో సంగసానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పవిత్రకుమారిని ఎంఈఓ మస్తాన్‌వలి శుక్రవారం శాలువాతో సన్మానించారు. ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోవడంపై అభినందించారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ-2కు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

ఉదయగిరి రూరల్: ఈ నెల 13వ తేదీ నుంచి జరిగే ఎఫ్‌ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సర్వరాబాదు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే వెంకట్రావుపల్లె హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 కే వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. వారి వెంట హెచ్‌ఎంలు జీ శ్రీనివాసులు, సంధ్యారాణి ఉన్నారు.

విద్యార్థుల శ్రమదానం

ఉదయగిరి రూరల్: ఉదయగిరి ప్రభుత్వ పాఠశాలకు చెందిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు శుక్రవారం శ్రమదానం చేశారు. దుర్గంపై ఉన్న కోన నీటిని సరఫరా చేసే కాలువ, తొట్టెలను శుభ్రం చేశారు. హెచ్‌ఎం జీ .శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



ఉదయగిరి: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ అబ్బాస్ హెచ్చరించారు. పట్టణ సమీపంలోని సర్వే నంబర్ 1191-4లోని విలువైన సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని టీడీపీ నాయకుల అండతో కొందరు వ్యక్తులు శుక్రవారం ఆక్రమించేందుకు యత్నించారు. జేసీబీతో ప్రభుత్వ భూమిని చదును చేసే పనులు చేపడుతుండగా స్థానికులు గమనించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ అబ్బాస్ ఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణదారులతో మాట్లాడగా తమకు గతంలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినందున సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఆర్‌ఐ పట్టాలు చూపించాలని కోరగా స్పందించలేదు. దీంతో ఆర్‌ఐ ప్రభుత్వ భూముల ఆక్రమణకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి



ఉదయగిరి: భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎంవీ మురళీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉషశ్రీ పథకంలో భాగంగా రూ.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న అదనపు తరగతి గదులు, ల్యాబ్ భవన నిర్మాణ పనుల నాణ్యతను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. సిమెంట్ నిర్మాణాలకు క్యూరింగ్ బాగా చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సైట్ ఇంజనీర్ వెంకట ప్రకాష్‌రెడ్డి, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



ఉదయగిరి: గుండెమడకలలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకల అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజాకుమారి పాల్గొని అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అడిషనల్ సీడీపీఓ చర్మిష్టా, సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీలు రాధ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమానికి సీడీపీఓ సునీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి బాలామృతం, బాలసంజీవని కిట్లు అందించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.